
సాక్షి బాపట్ల

సోమవారం । 28 । ఏప్రిల్ । 2025



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 514.40 అడుగుల వద్ద ఉంది. ఇది 139.2626 టీఎంసీలకు సమానం.



మహోంకాళీ అమ్మవారికి విరాళం

దుగ్గిరాల: కంఠంరాజుకొండూరులోని మహోంకాళి అమ్మవారికి గుంటూరుకు చెందిన శ్రీ వసుధ డెవలపర్స్ నిర్వాహకులు రూ.1,00,116 విరాళం అందజేశారు.

అంకమ్మ తల్లి తిరునాళ్లు



రొంపిచర్ల: బుచ్చిబా పన్నపాలెం గ్రామంలోని అంకమ్మ తల్లి ఆలయ తిరునాళ్ల వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

బరితెగించిన భూచోళ్లు

చీరాలలో భూముల విలువలకు రెక్కలొచ్చాయి. పంట పొలాలు కాస్తా అక్రమ లే ఔట్లతో ప్లాట్లుగా మారిపోయాయి. రియల్టర్లు జేబులు నింపుకొనేందుకు కనీస అనుమతులు కూడా తీసుకోకుండా ఇష్టానుసారంగా వేస్తున్నారు. అమాయకులకు అమ్మేసి నిబంధనలకు పాతర వేస్తున్నారు. అనుమతులు లేని ప్లాట్లు కొనుగోలు చేసి పలువురు మోసపోతున్నారు. మరోవైపు ప్రభుత్వ ఆదాయానికీ గండి పడుతోంది. కూటమి ప్రభుత్వం 'నాలా' చట్టాన్ని ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుంది గానీ దాని విధి విధానాలను ఇంకా అమలు చేయలేదు. దీన్ని అడ్డం పెట్టుకుని రియల్టర్లు రెచ్చిపోతున్నారు. పంట భూములను అనుమతులు లేకుండా ప్లాట్లు వేసి ఇష్టారాజ్యంగా అమ్మేస్తున్నారు.

- పంట భూములు ప్లాట్లుగా అవతారం
- గ్రామాల్లో ఇష్టారాజ్యంగా అక్రమ లేఔట్లు
- ప్రతి గ్రామంలో వెలసిన వెంచర్లు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- పట్టించుకోని అధికారులు



తోటవారిపాలెంలో సచివాలయాన్ని అనుకుని పంట పొలాల్లో అనుమతులు లేకుండా వేసిన ప్లాట్లు

చీరాల టౌన్: చీరాల రెవెన్యూ, పంచాయతీ అధికారులకు చేతులు తడిపితే చాలు.. ఎటువంటి అనుమతులు లేకుండా ప్లాట్లు వేసినా పట్టించుకోరు. కళ్లెదుటే అక్రమంగా వెంచర్లు వేస్తున్నా కన్నెత్తి చూడరు. తమకు ఆదాయ వనరుగా మారిన అక్రమ లే అవుట్లపై చర్యలు తీసుకోరు. చీరాల ప్రాంతంలో జనాభా సంఖ్య పెరుగుతుండటంతో విస్తీర్ణం కూడా పెరిగింది. గ్రామాల్లో 50 సెంట్ల వ్యవసాయ భూమిని కూడా రియల్టర్లు వదలడం లేదు. భూములకు డిమాండ్ పెరగడంతో పంట పొలాలను కూడా కొనుగోలు చేసి వాటిని ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు.

అనుమతి తీసుకోకుండా అమ్మకాలు

చీరాల ప్రాంతంలో మూడొంతుల లేఔట్లు కనీస అనుమతి కూడా తీసుకోకుండా ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారు. అవగాహన లేని పలువురు కొనుగోలు చేస్తున్నారు. ఆ తర్వాత మున్సిపాలిటీతో పాటు పంచాయతీల నుంచి అనుమతులు రాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఇళ్లు కట్టుకోవడానికి బ్యాంక్‌లు రుణ సౌకర్యం కూడా ఇవ్వకపోవడంతో కొనుగోలుదారులు నష్టపోతున్నారు.

పన్నుకు రియల్టర్లు ఎగనామం

ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నును కూడా రియల్టర్లు ఎగవేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంట పొలాలను ప్లాట్లుగా మార్చి లేఔట్లు వేయాలంటే ఆ పొలం మార్కెట్ విలువలో పదో వంతు కన్వర్షన్ ఫీజును పది శాతం ప్రభుత్వానికి జమ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన తర్వాత విస్తీర్ణంలో పదో వంతు స్థలం పార్కులకు, రోడ్లు, ఇతర అవసరాలకు వదలాల్సి ఉంటుంది. మిగిలిన స్థలంలోనే ప్లాట్లు వేసుకొని విక్రయించుకొనే అవకాశం ఉంటుంది. లేఔట్‌కు కూడా ప్రభుత్వం తప్పనిసరిగా అనుమతి ఇవ్వాల్సి ఉంది. ఇందుకు రియల్టర్ ప్రభుత్వానికి సెక్యూరిటీ డిపాజిట్ కూడా కొంత చెల్లించాల్సి ఉంటుంది. అయితే, గ్రామ పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో ప్రత్యేకాధికారుల పాలన రావడంతో రియల్టర్లు ఆగడాలు పేట్రేగిపోతున్నాయి.

అధికారుల ములాఖత్


గ్రామ పంచాయితీలకు కేటాయించిన ప్రత్యేకాధికారులు కొందరు భూముల యజమానులతో ములాఖత్ అయి అనుమతులు ఇస్తున్నారనే ప్రచారం జోరుగా ఉంది. వ్యవసాయ భూములను బదలాయింపు చేస్తే మంచినీటి సౌకర్యం, రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాలు వంటి సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. కానీ పంట పొలాల్లో వేసిన ప్లాట్లకు ఎలాంటి అనుమతులు లేవు. ప్లాట్లుగా మార్చుకొనేందుకు ప్రభుత్వానికి ఎటువంటి ఫీజులు చెల్లించడం లేదు. నేరుగా ప్లాట్లు వేసి ఇష్టారాజ్యంగా అమ్మేస్తున్నారు. టౌన్ ప్లానింగ్, పంచాయతీ అధికారులు అక్రమ లేఔట్లపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. రియల్టర్లు ఇచ్చే కాసుల కోసం ఉదాసీనతగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఎక్కడ పడితే అక్కడ లేఔట్లను వేసి ప్లాట్లను అమ్మేస్తున్నారు. కొనుగోలు చేసిన వారు మాత్రం నష్టపోతున్నారు.

చర్యలు తీసుకుంటాం

మండలంలో వేసిన లేఔట్లకు అనుమతులు ఉన్నాయో లేవో పరిశీలన చేస్తా. గ్రామాల్లో అనుమతులు లేకుండా వేసిన వెంచర్లు, వాటి వివరాలను సేకరించడంతో పాటుగా అనుమతులు లేకుండా ప్లాట్లు వేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. అసైన్డ్ భూములను ఆక్రమించి లే అవుట్లు వేస్తున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

–కుర్రా గోపీకృష్ణ, తహసీల్దార్

అసైన్డ్ భూములు సైతం అమ్మకం



అసైన్డ్ భూములను సైతం రియల్టర్లు దర్జాగా ప్లాట్లు వేసి అమ్మకాలు చేస్తున్నారు. మండలంలోని ఈపూరుపాలెం, తోటవారిపాలెం 216 బైపాస్ రోడ్డు, పాత దళితవాడ రోడ్డు, కుందేరు ఒడ్డు తదితర ప్రాంతాల్లోని పంట పొలాలన్నీ ఇళ్ల ప్లాట్లుగా మారాయి. చీరాల పట్టణానికి దగ్గరలో ఉన్న గ్రామ పంచాయితీల్లో సైతం ఇష్టానుసారంగా **ప్లాట్లు వేసి అమ్మకాలు** చేస్తున్నారు. ఎన్‌వో సీలు లేకపోయినా అధికార పార్టీ ఆమోదం ఉంటే చాలు. భూ మార్పిడికి కనీసం పంచాయతీ అనుమతి కూడా ప్లాట్లు వేసి భూముల అమ్మకాలు చేస్తున్నారు. కనీసం నివాసానికి అనువుగా ఉందో లేదో కూడా చూడటం లేదు. సౌకర్యాలు ఉన్నాయో లేవో కూడా పరిశీలించడం లేదు.

న్యూస్‌రీల్

గండాలయ స్వామి కొండకు పోటెత్తిన భక్తులు



మంగళగిరి: మంగళాద్రి కొండపై వేంచేసిఉన్న గండాలయ స్వామికి మొక్కితే ఎంతటి గండాన్నైనా గటెక్కిస్తాడని భక్తుల నమ్మకం. అమావాస్య ఆదివారం పూజలు నిర్వహిస్తే కోర్కెలు ఇట్టే తీరుస్తాడని ప్రసిద్ధి. దీంతో ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉదయం ఐదు గంటల నుంచే కొండకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. గండ దీపం వెలిగించారు. మంగళగిరి తాడేపల్లి చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు విజయవాడ, గుంటూరు ప్రాంతాల నుంచి భక్తుల రాకతో కొండ కిటకిటలాడింది.

బడులు తెరిచే నాటికి పాఠ్య పుస్తకాలు సిద్ధం




గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాలలు తెరిచే నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తామని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక తెలిపారు. అమరావతి రోడ్డులోని ప్రభుత్వ పాఠ్య పుస్తక గోదాము నుంచి ఆర్టీసీ బస్సుల్లో మండలాలకు పాఠ్య పుస్తకాలను పంపించే కార్యక్రమాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. డీఈవో మాట్లాడుతూ ముద్రణ సంస్థల నుంచి జిల్లా కేంద్రంలోని పాఠ్య పుస్తక గోదాముకు వచ్చిన పుస్తకాలకు మండలాలకు పంపుతున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా సెమిస్టర్–1లో ఉమ్మడి గుంటూరు జిల్లాకు ఇండెంట్ ప్రకారం 13.24 లక్షల పుస్తకాల్లో ఇప్పటి వరకు 7.50 లక్షలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠ్య పుస్తక మేనేజర్ వి. వజ్రబాబు, గుంటూరు ఈస్ట్ ఎంఈవో–1 అబ్దుల్ ఖుద్దూస్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, సిబ్బంది పాల్గొన్నారు.

రాహు కేతు పూజలకు భారీగా భక్తులు



పెదకాకాని: శివాలయంలో అమావాస్య ఆదివారం సందర్భంగా రాహు కేతువులకు పూజలు జరిపించేందుకు అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయంలోని రాహుకేతువు పూజల్లో పాల్గొనేందుకు దూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు వేకువజామునే క్యూలైన్లలో బారులు తీరారు. ఉదయం నాలుగు గంటల నుంచి సాయంత్రం రాహుకాల సమయం వరకు 1,509 టికెట్లు విక్రయించినట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ తెలిపారు. రాహు కేతు పూజల ద్వారా ఆదివారం రూ. 7,54,500 ఆదాయం సమకూరిందన్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా దేవస్థాన అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ పూజలతోపాటు అభిషేక పూజలు, అన్నప్రాసనలు, తలనీలాలు, వాహనపూజలు, అంతరాలయ దర్శనాలు, చెవిపోగులు తదితర ఇతర సేవలు ద్వారా రూ.9,10,000 ఆదాయం వచ్చినట్లు ఉప కమిషనర్ తెలిపారు.

వేసవి విజ్ఞాన తరగతుల బ్రోచర్ ఆవిష్కరణ



గుంటూరువెస్ట్: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ వేసవి విజ్ఞాన తరగతుల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సోమవారం నుంచి జూన్ 6 వరకు 40 రోజులపాటు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు జరిగే ఈ తరగతులకు పిల్లల్ని తల్లిదండ్రులు పంపాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ, ఉప గ్రంథ పాలకురాలు కె.ఝాన్సీ లక్ష్మి, లైబ్రేరియన్స్ ఎస్.నాగిరెడ్డి, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో 'పచ్చ'పాతం



నరసరావుపేట: పట్టణంలో మున్సిపల్ అధికారులు ఆక్రమణల తొలగింపులో 'పచ్చ'పాతం చూపిస్తున్నారనే విమర్శలు ప్రజల నుంచి వ్యక్తం అవుతున్నాయి. గత సోమవారం నుంచి పల్నాడు రోడ్డులో ఆక్రమణల తొలగింపును మున్సిపల్ పట్టణ ప్రణాళికా అధికారి సాంబయ్య నేతృత్వంలో సిబ్బంది జేసీబీ సహాయంతో నిర్వహిస్తున్నారు. తొలగింపుల్లో ఒక నిర్దిష్ట ప్రమాణాలు పాటించకుండా తమ ఇష్టానుసారంగా, అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారికి చెందిన షాపుల ముందు డ్రెయిన్లు, రోడ్డు మార్జిన్లలో ఏర్పాటు చేసిన కట్టడాలను తొలగిస్తున్నారు.

మరీ ఇంత దారుణమా?

పల్నాడు రోడ్డులోని బస్సులు, ఇతర వాహనాలు ఆగే ప్రాంతంలో రోడ్డుకు దక్షిణం వైపు మెడికల్ షాపు, టీ షాపుల ముందున్న మెట్లు డ్రైనేజీపై నిర్మించారనే కారణంతో తొలగించారు. దీంతో వినియోగదారులు కనీసం షాపుల్లోకి వెళ్లేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. దాని ముందు నిర్మించిన బస్‌షెల్టర్ రోడ్డుపైకి ఆరడుగులు ముందుకు చొచ్చుకొచ్చినా జోలికి వెళ్లలేదు. దానికి పసుపురంగు పులిమి ఉండటమే కారణంగా భావిస్తున్నారు. అది ఆక్రమణ కాకపోతే షాపుల ముందున్న నిర్మాణాలు ఏ విధంగా ఆక్రమణలు అవుతాయని స్థానిక వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. దానికి సమీపంలో టీడీపీ రంగులతో కోడి పలావ్ పేరుతో రోడ్డుపైకి నిర్మించిన కట్టడాన్ని మున్సిపల్ అధికారులు ముట్టుకోలేదు. దానికి ఇరువైపులా షాపుల ముందున్న చిన్నపాటి నిర్మాణాలను తొలగించారు. ఈ ప్రాంతం చూసిన ఎవరికైనా మున్సిపల్ అధికారులు సక్రమంగా ఆక్రమణలు తొలగించట్లేదనే భావన కలుగుతుంది.

జిల్లా ఎస్‌బీకి దిక్కెవరు?



గుంటూరు జిల్లా ఎస్పీ బంగ్లా రోడ్‌లోని జిల్లా ఎస్‌బీ కార్యాలయం

పోలీస్ శాఖకు స్పెషల్ బ్రాంచి (ఎస్‌బీ) కీలకం. ముందస్తు సమాచారం చేరవేయడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుంటుంది. ఆ విభాగం వారిచ్చే సమాచారంతో నేరాల నియంత్రణ, ఇతరత్రా నేరాలను కట్టడి చేసేందుకు అవకాశాలెక్కువ. పోలీస్ ఉన్నతాధికారులు సైతం నిఘా వ్యవస్థ అందించే సమాచారంతోనే ముందుకెళ్తారు. అటువంటి ఎస్‌బీ రాజధాని గుంటూరు జిల్లాలో అస్తవ్యస్తంగా మారింది. గడిచిన రెండేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది.

- గత రెండేళ్లుగా కానరాని సరైన సారథి
- వీఆర్‌లు, ఉద్యోగ విరమణ వైపు మొగ్గు
- అరకొరగానే ముందస్తు సమాచారం సేకరణ
- రాజధాని జిల్లా గుంటూరులో ఇదీ పరిస్థితి

నగరంపాలెం: జిల్లాలోని ఎస్‌బీ పోలీస్ శాఖకు ఆయువు వంటిది. అటువంటి ఆ శాఖలో డీఎస్పీలు ఎక్కువ కాలం పని చేయలేక పోతున్నారు. కనీసం ఏడాదైనా ఉండటం లేదు. కేవలం మూడు నుంచి ఐదారు నెలల వరకే పరిమితమవుతున్నారు. గతంలో విధుల్లో ఉన్న ఇద్దరు డీఎస్పీల పరిస్థితి అలాగే మారింది. కొందరు డీఎస్పీలపై విమర్శలు వెల్లువెత్తడంతో సీఐలకు, కింది స్థాయి ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లకు దిశా నిర్దేశం చేసే వారు కనిపించడంలేదు. అనధికార మామూళ్లు, సొంత సిబ్బంది నుంచే వసూళ్ల పర్వానికి పాల్పడటంతో అప్పటి ఎస్‌బీ సీఐ నరసింహారావును సస్పెండ్ చేశారు. డీఎస్పీ సుభాష్‌ను వీఆర్‌లోకి పంపించారు. ఆయన సుమారు ఆరు నెలలు మాత్రమే విధులు నిర్వర్తించారు. అనంతరం డీఎస్పీలుగా టీవీ రత్నస్వామి, పోతురాజు పనిచేశారు. వీరిలో ఒకరు మూడు, మరొకరు ఐదు నెలలు పని చేశారు. అంతలోనే వారిద్దరూ ఉద్యోగ విరమణ పొందారు. ఇక కొద్ది నెలలు డీఎస్పీ పోస్ట్ ఖాళీగా మారింది. కొన్నాళ్లు సీఐలే జిల్లా అంతటా పర్యవేక్షణ చేపట్టారు.

మళ్లీ డీఎస్పీ పోస్టు ఖాళీ

కూటమి ప్రభుత్వ హయాంలో గతేడాది సెప్టెంబర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్పీల బదిలీలు జరిగాయి. ఇందులో ఎస్‌బీ డీఎస్పీగా బి.సీతారామయ్యను నియమించారు. ఆయన సుమారు ఎనిమిది నెలలు విధులు నిర్వర్తించారు. ఇటీవల మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ అరెస్ట్ వ్యవహారంలో తలెత్తిన పరిణామాల దృష్ట్యా డీఎస్పీ సీతారామయ్యను వీఆర్‌కు పంపించారు. ఇందులో డీఎస్పీని వీఆర్‌కు, ఒక సీఐ, ఇద్దరు ఎస్ఐలు, ఏఎస్ఐ, హెచ్‌సీ, కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అప్పటుంచి డీఎస్పీ పోస్ట్ ఖాళీ అయ్యింది. డీఎస్పీని నియమించాలంటే రాష్ట్ర డీజీపీ ప్రధాన కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. దీంతో ఎస్‌బీలో ఉన్న సీఐలు మాత్రమే ఏఎస్ఐలు, హెచ్‌సీలు, కానిస్టేబుళ్లను పర్యవేక్షణ చేస్తున్నారు.

ప్రధాని పర్యటన నేపథ్యంలో..

జిల్లాలో నెలకొన్న పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగే ర్యాలీలు, ధర్నాలు, నిరసనలు వంటి ముందస్తుగా సమాచారం సేకరించాల్సి ఉంది. ఇవన్నీ ఒక ఎత్తైతే నేరాల నియంత్రణకు సంబంధించి నిరంతర నిఘా ఉండాల్సిందే. వచ్చే నెల 2వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ రాజధాని ప్రాంతంలో పర్యటించనున్నారు. ఈ క్రమంలో వచ్చే వీవీఐపీలు, వీఐపీలు ఇతరత్రా ప్రముఖుల రాకతో మౌలిక సౌకర్యాల కల్పనపై తర్జనభర్జన పడుతున్నారు. ఐపీఎస్ అధికారులు, ఇతరత్రా బలగాలు ఉన్నప్పటికీ ఎస్‌బీకి సమర్థ డీఎస్పీని నియమించాల్సిన అవసరం ఉంది.

పాలకుల శీతకన్ను

ఎస్‌బీ డీఎస్పీ పరిధిలో గుంటూరు పశ్చిమ, తూర్పు, దక్షిణ, ఉత్తర, తెనాలి, మంగళగిరి సబ్ డివిజన్‌లు ఉన్నాయి. జిల్లాలో రాష్ట్ర రాజధాని ఉంది. అసెంబ్లీ, హైకోర్టు కూడా ఇక్కడే కొలువుదీరాయి. సీఎం, డిప్యూటీ సీఎం, హోంమంత్రి, మంత్రులు, ఎంపీలు, రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులు ఎక్కువగా ఇక్కడే ఉంటారు. ఇటువంటి తరుణంలో ఎక్కడ ఏం జరుగుతోందనే ముందస్తు సమాచారం సేకరణలో సమర్థమైన గ్రూప్–1 డీఎస్పీని నియమించాల్సిన అవసరం ఉంది. జిల్లాలోని గుంటూరు పశ్చిమ, తూర్పు సబ్ డివిజన్ డీఎస్పీ పోస్టులపై ఉన్న మక్కువ ఎస్‌బీ డీఎస్పీ పోస్ట్‌పై ఉన్నతాధికారులకు లేదు. దీంతో ముందస్తు సమాచారం సేకరణలో కొంత మేర అలస్యమవుతుందనే ఆరోపణలు లేకపోలేదు.

నటించి.. నమ్మించి.. ముంచి!

- అధిక వడ్డీల ఆశ చూపి ప్రజల నుంచి డబ్బు వసూలు
- నమ్మకంగా ఏళ్ల తరబడి వ్యాపారాల నిర్వహణ
- రూ. వందల కోట్లు కొల్లగొట్టి పరారీ
- వ్యాపారాల పేరిట ప్రజలను మోసగించిన వైనం
- పెరుగుతున్న యానిమేషన్ స్కాం బాధితుల సంఖ్య

సాక్షి, నరసరావుపేట: అవసరానికి ఉపయోగపడతాయని రూపాయి రూపాయి కూడబెట్టి పెట్టుబడులు పెట్టిన వారు భారీ మోసాలను చూసి అమ్మో అంటూ గుండెలు బాదుకుంటున్నారు. తనువు చాలిస్తున్నారు. ఇది ఓ యానిమేషన్ స్కాంతో మొదలుకాలేదు. నిత్యం ఇలాంటివి ఏదో ఒక మూల వింటూనే ఉన్నాం. అయినా సరే అధిక లాభాలు, వడ్డీల ఆశ చూపి మోసగాళ్లు ప్రజల్ని మోసం చేస్తూనే ఉన్నారు. మోసపోయే మనలో కూడా ఎంతో కొంత తప్పు ఉందన్న వాస్తవాన్ని గ్రహించి జాగ్రత్తగా ఉన్నప్పుడే ఇలాంటి మోసాలకు అడ్డుకట్టపడేది.

ఆడి కార్‌లో వచ్చి మరీ..

దేశంలో ఆర్థిక నేరాలను వివిధ రూపాల్లో చూస్తుంటాం. బ్యాంకులకు రుణాలు ఎగనామం పెట్టే వాళ్ల దగ్గర నుంచి చిన్న మొత్తాల్లో చీటీలు వసూలు చేసి జేబులకు చిల్లులు పెట్టే వారు, టెక్నాలజీ సాయంతో సైబర్ మోసాలకు పాల్పడే వారు కనిపిస్తుంటారు. అయితే, నరసరావుపేటలో మాత్రం నమ్మకాన్ని పెట్టుబడిగా పెట్టి నట్టేట ముంచుతున్నారు. అధిక వడ్డీల ఆశ చూపి రూ.కోట్లకు కోట్లు సేకరించి రాత్రికి రాత్రి పరారవుతున్నారు. చిట్‌ఫండ్ స్కాం, ఐపీ పెడుతున్న వ్యాపారులు, తాజాగా యూపిక్స్ యానిమేషన్ స్కాం.. ఇలా ఏది చూసినా ప్రజలను నమ్మించి నట్టేట ముంచుతున్నారు. యూపిక్స్ సంస్థ అధినేత కిరణ్ తను చేస్తున్న యానిమేషన్ ప్రాజెక్టులను లేనిది ఉన్నట్టు పెద్దగా చూపి పెట్టుబడిదారులను మోసం చేశాడు. పెద్ద ప్రాజెక్టులు వచ్చాయని ఒక్కసారిగా తన వద్ద అంత డబ్బులు లేవని నమ్మించాడు. పెట్టుబడి పెడితే ఆరు నెలల్లో రెట్టింపు చేసి ఇస్తానని నమ్మబలికాడు. ఇలా రెండేళ్లు పెట్టుబడిదారులకు లాభాల రుచి చూపడంతో వారిలో నమ్మకం పెరిగింది. మరోవైపు తమ కళ్ల ముందే కిరణ్ జీవనవిధానం రోజురోజుకు లగ్జరీగా మారడం కూడా మోసపోవడానికి కారణమైంది. సాధారణ కారులో తిరిగే కిరణ్ ఒక్కసారిగా ఆడి కార్లు, రేంజ్ రోవర్లలో చక్కర్లు కొట్టడం, విజయవాడలోని పలు ప్రాంతాల్లో బహుళ అంతస్తుల భవనాలు, విలువైన స్థలాలు ఉండటంతో తమ డబ్బులు ఎక్కడికీ పోవనే ధీమాతో స్తోమతకు మించి పెట్టుబడులు పెట్టడంతో అడ్డంగా బుక్ అయ్యారు.



వీడియో సందేశం ఇస్తున్న కిరణ్ (ఫైల్)

ఒట్టు వేయించుకొని మరీ మోసపోయి...


కిరణ్ తన పెట్టుబడిదారులకు రాసిన లేఖలో విస్తుపోయే విషయాలు బయటపడుతున్నాయి. పెట్టుబడిదారులకు డబ్బులు తిరిగి ఇచ్చేందుకు భారీ స్థాయిలో కొత్త పెట్టుబడిదారుల ద్వారా నగదు సేకరించానని చెప్పుకొచ్చాడు. యానిమేషన్ ప్రాజెక్టులు లేకపోయినా లాభాలు పంచి ఇవ్వడంతో పెట్టుబడిదారులు తమ స్తోమతకు మించి డబ్బుల మూటలు తెచ్చి కిరణ్‌కు అప్పగించారట. ఇంత పెద్ద మొత్తంలో డబ్బులు పెడుతున్న సమయంలో ఎవరైనా మా డబ్బులకు గ్యారెంటీ ఏంటి అని అడుగుతారు. కానీ యానిమేషన్ బాధితులు మాత్రం తాము పెట్టుబడి పెట్టినట్టు రెండో వ్యక్తికి తెలియకూడదని ఒట్టు వేయించుకున్నారని కిరణ్ తన లేఖలో తెలిపాడంటే పెట్టుబడిదారులు ఎంతటి మాయలో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. ఇలా ఒకరికి తెలియకుండా ఒకరు రూ.కోట్లకు కోట్లు తనకు ముట్టచెప్పడంతో యానిమేషన్ స్కాం ఏకంగా రూ.వెయ్యి కోట్ల దాకా వెళ్లింది. 2024 ఏప్రిల్ వరకు తాను చెబుతున్నవి అబద్ధాలు అని తెలిసినా వారికి లాభాలు పంచి ఇవ్వడంతో ఏ ఒక్కరూ నోరు విప్పలేదని తెలిపాడు. అంటే కిరణ్ మోసం చేస్తున్నా తమకు అధిక వడ్డీతో తిరిగి ఇస్తున్నాడన్న ఆశలో పెట్టుబడిదారులు పట్టించుకోలేదని అర్థమవుతోంది. ఎంతగా అంటే మాకు మరిన్ని లాభాలు కావాలి.. నువ్వు పెద్ద ప్రాజెక్టులు చేయి, మేం డబ్బులిస్తామని తనను ప్రోత్సహించారని కిరణ్ చెప్పుకొచ్చాడు. సమాజంలో మన మధ్యే తిరుగుతున్న కిరణ్ లాంటి ఎందరో మోసగాళ్ల బారినపడకుండా ఉండాలంటే ప్రజలు అధిక లాభాలు, వడ్డీలకు మోసపోకుండా అప్రమత్తంగా ఉన్నప్పుడే మన కష్టార్జితానికి ఎలాంటి ఇబ్బందీ ఉండదు.

'కపిరాజు' నాటికకు ప్రథమ బహుమతి

ముగిసిన తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు

మార్టూరు : శ్రీకారం రోటరీ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 24, 25, 26 తేదీల్లో మార్టూరులో నిర్వహించిన తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు శనివారంతో ముగిశాయి. ఇరవై కేటగిరీలకు గాను ఆరింటిలో బహుమతులను కైవసం చేసుకుని న్యూ స్టార్ మోడ్రన్ థియేటర్ విజయవాడ వారి 'కపిరాజు' నాటిక అగ్రస్థానంలో నిలిచింది. నాలుగు కేటగిరిల్లో బహుమతులు పొంది కళానికేతన్ వీరన్నపాలెం వారి 'రుతువులేని కాలం' నాటిక ద్వితీయ స్థానం, మూడు కేటగిరిల్లో బహుమతులు సాధించి విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారి స్వేచ్ఛ నాటిక తృతీయ స్థానంలో నిలిచింది.

- కపిరాజు నాటికకు సంబంధించి ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ దర్శకుడిగా ఎమ్మెస్ చౌదరి బహుమతులు అందుకున్నారు. ఉత్తమ సహాయ నటుడిగా పవన్ కల్యాణ్, ఉత్తమ మేకప్ మెన్‌గా దినేష్, పవన్ కుమార్, దిలీప్ రెండు ప్రత్యేక బహుమతులు అందుకున్నారు.
- కళానికేతన్ వీరన్నపాలెం వారి 'రుతువులేని కాలం' నాటికకు గాను తృతీయ ఉత్తమ ప్రదర్శనతో పాటు ఉత్తమ రచయితగా అగస్త్య, ఉత్తమ హాస్య నటునిగా సురేంద్రబాబు, సురభి పూజిత ప్రత్యేక బహుమతులు అందుకున్నారు.
- విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారి 'స్వేచ్ఛ' నాటికకు గాను ఉత్తమ నటుడిగా గోవాడ వెంకట్, మంజు భార్గవి ప్రత్యేక బహుమతితో పాటు ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా ఎంపికైంది.
- యంగ్ థియేటర్ ఆర్ట్స్ విజయవాడ వారి '27వ మైలురాయి' నాటికలో ఉత్తమ నటిగా సురభి ప్రభావతి, ప్రత్యేక బహుమతిని కిరణ్ అందుకున్నారు.
- అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి 'విడాకులు కావాలి' నాటికకు గాను ఉత్తమ విశిష్ట నటునిగా గంగోత్రి సాయి, ఉత్తమ రంగాలంకరణకు గాను ప్రసాద్, హనీఫ్ బహుమతి అందుకున్నారు.
- శ్రీ సాయి ఆర్ట్స్ 'జనరల్ బోగీలు' నాటికలో సీఐ పాత్రధారి గోపరాజు విజయ్ ఉత్తమ విలన్‌గా, చైతన్య కళా స్రవంతి విశాఖ వారి(అ')సత్యం నాటికలో ఉత్తమ క్యారెక్టర్ యాక్టర్‌గా బాలాజీ నాయక్ బహుమతులు అందుకున్నారు.
- మైత్రి కళానిలయం విజయవాడ వారి బ్రహ్మస్వరూపం నాటిక ప్రత్యేక ప్రదర్శన గాను బహుమతులు అందుకుంది. విజేతలకు న్యాయ నిర్ణేతల ఆధ్వర్యంలో ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జె.వి.మోహనరావు, శ్రీకారం రోటరీ కళాపరిషత్ ప్రతినిధులు, మార్టూరు రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మద్దుమాల కోటేశ్వరరావు, మాదాల సాంబశివరావు, ఈశ్వర ప్రసాద్, లక్ష్మయ్య బహుమతి ప్రదానం చేశారు.



ఉత్తమ నటుడిగా బహుమతి అందుకుంటున్న గోవాడ వెంకట్

క్లుప్తంగా

ఉర్దూ పోస్టులు తీసేయడం సబబు కాదు

వైఎస్సార్ టీచర్ల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు బొజ్జా సురేష్

పర్చూరు(చినగంజాం): టీచర్ల బదిలీల్లో తెలుగు మీడియం పాఠశాలల్లో ఉర్దూ సెకండరీ గ్రేడ్ టీచర్ల పోస్టులను తీసేయడం సబబు కాదని బాపట్ల జిల్లా వైఎస్సార్ టీచర్ల ఫెడరేషన్ అధ్యక్షులు బొజ్జా సురేష్ తెలిపారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన టీచర్ల బదిలీ జాబితా ప్రకారం ఉర్దూ మీడియం పాఠశాలల్లో కొన్ని పోస్టులను తీసివేసి తెలుగు పోస్టులను ఉంచినట్లు పేర్కొన్నారు. తెలుగు మీడియం పాఠశాలల్లో ఉన్న ఉర్దూ ఎస్‌జీటీ పోస్టులను తీసివేశారన్నారు. ఈ విధంగా చేయడం వల్ల జిల్లాలో ఉర్దూ భాష మరుగున పడే ప్రమాదం ఉందని తెలిపారు. ఉర్దూ మీడియం పాఠశాలలో ఎస్‌జీటీ(తెలుగు) పోస్టులను అడిషనల్ పోస్టులుగా చూపించాలని డిమాండ్ చేశారు. మైనార్టీ విద్యార్థులను, వారి భాషను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని ఉర్దూ ఎస్జీటీ పోస్టులను యథావిధిగా కొనసాగించాలని ఆయన కోరారు.

జనసేన కన్వీనర్ రాజేష్‌కు నోటీసు

చావలి(వేమూరు): జనసేన నియోజకవర్గ కన్వీనర్ ఊసా రాజేష్ దళిత వర్గానికి చెందిన కొండయ్యను చెప్పుతో కొట్టి పార్టీ నియమావళి ఉల్లఘించినందుకు నోటీసు జారీ చేసినట్లు పార్టీ కాన్ఫ్లిక్ట్ మేనేజ్‌మెంటు హెడ్ వేములపాటి అజయ కుమార్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దాడిపై లిఖితపూర్వకంగా 48 గంటల్లో కేంద్ర కార్యాలయంలో సమర్పించాలని పార్టీ ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. విచారణ చేసిన తర్వాత చర్యలను పార్టీ తీసుకుంటుందని తెలిపారు. దళితలపై జన సేన పార్టీ నాయకులు, కార్యకర్తలు దాడులకు పాల్పడితే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

నదిలో దూకి గుర్తు తెలియని వ్యక్తి మృతి



తాడేపల్లి రూరల్: కృష్ణానది ప్రకాశం బ్యారేజ్ పైనుంచి ఓ వ్యక్తి కృష్ణానదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై తాడేపల్లి పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ప్రతాప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణానది సీతానగరం వైపు ప్రకాశం బ్యారేజ్ 6వ ఖానా వద్ద శనివారం రాత్రి ఓ యువకుడు కృష్ణానదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కృష్ణానది నీటి స్టోరేజ్ కోసం ఏర్పాటు చేసిన గేటుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకుని పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించగా ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతుడి వయస్సు 30 సంవత్సరాలు లోపు ఉంటుంది. మృతుడి శరీరంపై నల్ల జీన్స్ ఫ్యాంట్, నల్లని చొక్కా ధరించి ఉన్నాడు. ఎవరైనా మృతదేహాన్ని గుర్తిస్తే 8008443915 నంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్‌ఐ కోరారు.

వైభవంగా పుట్టలమ్మ శిడిమాను రథోత్సవం



పుట్టలమ్మ అమ్మవారు



శిడిమాను రథోత్సవంలో భక్తులు

- కన్నుల పండువగా తిరునాళ్ల
- తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు

కర్లపాలెం: భక్తుల కొంగు బంగారం, కోరిన కోర్కెలు తీర్చే తల్లి యాజలి గ్రామదేవత శ్రీ పుట్టలమ్మ అమ్మవారి తిరునాళ్ల, శిడిమాను రథోత్సవం ఆదివారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. పుట్టలమ్మ అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలు, వివిధ రకాల పూలు, పూలమాలలతో ప్రత్యేక అలంకరణ చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు తాము పండించిన పంటలను అమ్మవారి శిడిమానుకు కట్టి పూజలు చేశారు. మంగళవాయిద్యాలు, కనకతప్పెట్లతో సంప్రదాయం ప్రకారం పెండ్లి కుమారుడిని ఆలయం వద్దకు తీసుకు వచ్చారు. మేకపోతుకు విశేష పూజలు నిర్వహించారు.ఆలయంలోని పుట్టలమ్మ అమ్మవారి ప్రతిమను బుట్టలో తీసుకొచ్చి శిడిమాను రథంపై ఉంచారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి శిడిమాను అగ్రభాగాన ఉన్న ఇనుప బోనులో మేకపిల్లను ఉంచి పూజలు చేశారు. అనంతరం భక్తుల జయజయ ధ్వానాల మధ్య శిడిమానును పైకి లేపారు. భక్తులందరూ పారవశ్యంతో దర్శించుకున్నారు. కొబ్బరికాయలు, వివిధ రకాల పండ్లు, పువ్వులను మేకపిల్ల ఉన్న బోనుపై విసిరారు. అనంతరం అమ్మవారి శిడిమానును మంగళవాయిద్యాలు, కనకతప్పెట్లతో గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. అమ్మవారి ఆలయానికి వచ్చిన వేలాది మంది భక్తులు రథోత్సవాన్ని తిలకించారు. గుడిచుట్టూ ప్రదక్షిణలు చేసి పసుపుకుంకుమలతో అమ్మవారికి పూజలు చేసి కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. యాజలి శివారు సమీప గ్రామాలలోని రైతులు పశువులను గుడిచుట్టూ ప్రదక్షిణలు చేయించారు. పాడిపంటలు వృద్ధి చెందాలని పూజలు చేశారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయం వద్ద విద్యుత్ ప్రభలు ఆకర్షణగా నిలిచాయి. కర్లపాలెం ఎస్‌ఐ రవీంద్ర సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

వ్యవసాయ కూలీ కుమారుడికి డాక్టరేట్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న యల్లమాటి మహేష్

కొల్లూరు: వ్యవసాయ కూలీ కుటుంబంలో పుట్టిన ఓ యువకుడు ఉన్నత చదువుల్లో రాణించి డాక్టరేట్ పొందడంపై స్థానికుల్లో హర్షం వ్యక్తమవుతోంది. మండలంలోని చింతర్లంకకు చెందిన యల్లమాటి ప్రభుదాసు, కృపావరం కుమారుడు మహేష్ చెన్నైలోని శ్రీరామచంద్ర మెడికల్ కళాశాలలో అనాటమీ విభాగంలో ఎమ్మెస్సీ పీహెచ్‌డీ పట్టాను గత శుక్రవారం అందుకున్నారు. సీసం అనేది కెమికల్ అని, పురుషుల శుక్ర కణాలను తగ్గించడం వల్ల సంతాన సాఫల్యత తగ్గుతుందనే అంశంపై, శుక్రకణాలు పెంపొందిచుకోవడానికి చేపట్టాల్సిన అంశాలపై జరిపిన పరిశోధనలకు గాను డాక్టరేట్ అందుకున్నాడు. డాక్టరేట్ సాధించడంపై పలువురు గ్రామస్తులు మహేష్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నత చదువులు ద్వారా రాణించాలన్న లక్ష్యంతో తల్లిదండ్రుల కష్టానికి ప్రతిఫలంగా డాక్టరేట్ సాధించడం సంతోషకరంగా ఉందని వెల్లడించాడు.

పందిళ్లమ్మ గుడిలో చోరీ



వేటపాలెం: మండలంలోని పందిళ్లపల్లి శివారు పంట పొలాల్లో ఉన్న గ్రామ దేవత పందిళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. దొంగలు దేవస్థానం ముందు వైపుగల కటకటాల తాళాలు పగలగొట్టి లోపలకు ప్రవేశించారు. హుండీని కూడా పగలగొట్టి అందులోని నగదు, బీరువాని తెరచి అమ్మవారి నగలు ఎత్తుకెళ్లారని ఎస్‌ఐ ఎం. వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. చోరీకి గురైన మొత్తం విలువ రూ.30 వేలు ఉంటుందని పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

బల్లికురవ: కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఎలుకల మందు పేస్టు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి మండలంలోని చిన అంబడిపూడిలో జరిగింది. 108 సిబ్బంది, స్థానికుల సమాచారం మేరకు.. చిన అంబడిపూడి బీసీ కాలనీకి చెందిన పల్లపు అనూష ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలుకల మందు పేస్టు తిని అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. సిబ్బంది ప్రాథమిక చికిత్స చేసి అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనూష ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

దివ్యాంగ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

బాపట్ల: దివ్యాంగ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర దివ్యాంగ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డి.ఎల్లయ్య కోరారు. స్థానిక ఎన్జీవో హోంలో ఆదివారం దివ్యాంగ ఉద్యోగుల సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు ఏ.శివాజీగణేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఇందులో రాష్ట్ర అధ్యక్షుడు డి.ఎల్లయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో దివ్యాంగ ఉద్యోగులు పనులు చేసే చోట తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఫేషియల్ అటెండెన్స్, సీపీస్ విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. షరతులు లేకుండా ఏడు సాధారణ సెలవులను వర్తింపు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ప్రకాశం జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు, ట్రెజరర్ శివ, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, సీహెచ్. శ్రీనివాసరావు, మురళి, కృష్ణమోహన్, జిలాని పాల్గొన్నారు.



సమావేశంలో ఎల్లయ్య తదితరులు

నేడు గుంటూరులో కోకో రైతుల ధర్నా

కొరిటిపాడు(గుంటూరు): అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో గింజలకు ధర కల్పించాలని, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఇచ్చిన హామీ ప్రకారం ధరల ఒప్పందం నిర్ణయం ప్రకటించాలని కోరుతూ సోమవారం రైతులు ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బొల్లు రామకృష్ణ, కె.శ్రీనివాస్‌లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు గుంటూరు చుట్టుగుంటలోని ఉద్యాన శాఖ రాష్ట్ర కమిషనర్ కార్యాలయం ఎదుట జరిగే కోకో రైతుల ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో 75 వేల ఎకరాల్లో కొబ్బరి, ఆయిల్ ఫామ్ అంతర పంటగా కోకోను రైతులు సాగు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు అంతర్జాతీయ మార్కెట్ ధరకు అదనంగా ధర ఇచ్చి కోకో గింజలు కొనుగోలు చేసిన కంపెనీలు నేడు సిండికేట్‌గా మారి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో గింజలకు రూ.750 పైగా ధర ఉందని, ప్రస్తుతం కంపెనీలు రూ.450 నుంచి రూ.500 వరకు మాత్రమే ఇస్తున్నాయని తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతుల నుంచి కోకో గింజలను కొనుగోలు చేయడం లేదని, ఒకవేళ చేసినా తక్కువ ధర ఇవ్వడం వల్ల నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోకో గింజలు కొనుగోలు, ధరల సమస్యలపై ఈ నెల 3వ తేదీన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెంనాయుడు రాష్ట్ర సచివాలయంలో ఉద్యాన శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు, కోకో రైతులు, కొనుగోలు కంపెనీలతో సమావేశం నిర్వహించారని వెల్లడించారు. ఈ సమావేశం నిర్ణయం ప్రకారం ఈ నెల 7వ తేదీన కోకో గింజల ఒప్పంద నిర్ణయం ప్రకటన చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు ప్రకటించకపోవడంతో కంపెనీలు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు ఫలితంగా కోకో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంతర్జాతీయ మార్కెట్ ధర ప్రకారం కోకో గింజలకు ధర కల్పించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ధర్నాలో కోకో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

కుమారుడు సహా తల్లి ఆత్మహత్యాయత్నం

- ప్రాణాలు కోల్పోయిన బాలుడు
- విషమంగా తల్లి పరిస్థితి

లక్ష్మీపురం: కుటుంబ కలహాలతో కుమారుడు సహా ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటనలో బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. తల్లి పరిస్థితి విషమంగా ఉంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామానికి చెందిన ఆదూరి గణేష్ (38), కుమారి దంపతులకు కుమారుడు చంద్రశేఖర్ మణికంఠ (9) ఉన్నాడు. గణేష్ గుంటూరు ఎల్‌వీఆర్ క్లబ్‌లో పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మార్చి 30వ తేదీన గుండె పోటు కారణంగా మృతి చెందాడు. ఆ తరువాత గుంటూరులోని మారుతీనగర్‌లో గల మహాప్రస్థానంలో నిద్ర చేయడానికి కుమారి, చంద్రశేఖర్ మణికంఠలతోపాటు అత్తమామలు వెళ్లారు. భర్త మృతితో కుమారి మానసికంగా బాధపడుతోంది. ఈ నెల 24వ తేదీన కుమారుడిని అత్త మందలించడంతో ఎలుకల మందు తీసుకుని గుజ్జనగుండ్ల పార్క్‌కు కుమారి వెళ్లింది. బాలుడికి తినిపించి తానూ తిని ఆత్మహత్యాయత్నం చేసింది. తర్వాత అమరావతికి చేరుకున్నారు. అత్తమామలు పట్టాభిపురం పోలీసులను ఆశ్రయించడంతో సీఐ గంగా వెంకటేశ్వర్లు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. అమరావతిలో ఉన్నట్లు గుర్తించారు. స్థానికులు గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ చంద్రశేఖర్ మణికంఠ ఆదివారం మృతి చెందాడు. కుమారి పరిస్థితి విషమంగా ఉంది.

స్కూటీని ఢీ కొట్టిన లారీ

వ్యక్తి మృతి



కృష్ణారెడ్డి మృతదేహం

వేటపాలెం: వేగంగా వస్తున్న లారీ ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీ కొట్టిన సంఘటనలో వ్యక్తి మతి చెందాడు. 216 జాతీయ రహదారి బైపాస్ రోడ్డులో అక్కాయిపాలెం దగ్గరలో సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీస్ లు తెలిపిన వివరాల మేరకు... చీరాలకు చెందిన రాజు కృష్ణారెడ్డి(61) స్కూటీపై వేటపాలెం పని నిమిత్తం వచ్చాడు. పని ముగించుకుని రాత్రి తిరిగి బైపాస్ రోడ్డు మీదగా చీరాల బయలు దేరాడు. అక్కాయిపాలెం జంక్షన్ దగ్గరలో చీరాల వైపు నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీ కొట్టింది. తీవ్ర గాయాలతో ఉన్న వ్యక్తిని చీరాల ఏరియా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో పరస్పర దాడులు

చీరాల: మద్యం మత్తులో ఇరువురు వ్యక్తులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న సంఘటన ఆదివారం చీరాలలో చోటుచేసుకుంది. శ్రీకాంత్, ప్రశాంత్ ఇద్దరు బంధువులు. ఆదివారం మద్యం తాగి ఇద్దరు ఘర్షణ పడి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో శ్రీకాంత్‌కు గొంతులో కత్తి గుచ్చుకుంది. చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు తరలించారు. ప్రశాంత్ చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు అవుట్ పోస్టు పోలీసులు వివరాలను నమోదు చేశారు.

యువకుడిపై కత్తితో దాడి కేసులో నిందితుడి అరెస్టు

రేపల్లె రూరల్: యువకుడిపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన కేసులో నిందితుడిని అరెస్టు చేసి ఆదివారం కోర్టుకు హాజరు పరిచినట్లు పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. భార్యతో సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో పట్టణంలోని 7వ వార్డుకు చెందిన దేవరకొండ కోటేశ్వరరావు అదే వార్డుకు చెందిన దేవరపల్లి నవీన్ కుమార్‌పై ఈనెల 26న కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. బాధితుడు నవీన్ కుమార్ తల్లి స్వరూపరాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు. ఈ మేరకు నిందితుడు కోటేశ్వరరావును అరెస్టు చేసినట్లు చెప్పారు.

కేంద్ర ప్రభుత్వ విధానంతో పెన్షనర్లకు నష్టం

విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆందోళన



సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

మార్టూరు: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సివిల్ సర్వీస్ రూల్స్- 1972 సవరణ చట్టం విశ్రాంత ఉద్యోగుల పాలిట శాపమని సంఘం మార్టూరు యూనిట్ అధ్యక్షులు కొరిటేల రామారావు పేర్కొన్నారు. చట్టాన్ని అమలు చేయకుండా ఆపాలని డిమాండ్ చేశారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సమావేశం హాలులో ఆదివారం నిర్వహించిన యూనిట్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సవరణ చట్టం ద్వారా ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ప్రభుత్వం చేపట్టే పీఆర్సీ నుంచి విశ్రాంత ఉద్యోగులను మినహాయిస్తారన్నారు. సర్వీసులో ఉన్న ఉద్యోగులకు మాత్రమే పీఆర్సీ వర్తించేలా కేంద్ర ప్రభుత్వం చట్టం చేయటం వల్ల పెన్షనర్లకు అన్యాయం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వేతన సవరణ చట్టం అనేది ఉద్యోగులకు కాలానుగుణంగా, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వం కల్పిస్తూ వస్తున్న సౌకర్యం అని తెలిపారు. విశ్రాంత ఉద్యోగులను దీని నుంచి మినహాయించడం వారిపై వివక్ష చూపటమేనని ఆయన పేర్కొన్నారు. వృద్ధాప్యంలో పెన్షనర్లు పిల్లల చదువులు, పెళ్లిళ్లు, అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటారన్నారు. పీఆర్సీ సవరణ చట్టం నుంచి వారిని మినహాయించడం సబబు కాదని తెలిపారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు వర్తించనున్న ఈ చట్టాన్ని తరువాత రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అమలు చేసే ప్రమాదాలు ఉన్నాయని చెప్పారు. విశ్రాంత ఉద్యోగులంతా ఏకమై దీన్ని అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రావుల బాపయ్య చౌదరి, ఎం. ఎస్. చిట్టిబాబు, పి.శివరామ కోటేశ్వరరావు, మద్రి కోటేశ్వరరావు, పి.అంకయ్య, వెంకటేశ్వర్లు, రాజేంద్రబాబు పాల్గొన్నారు.

పహల్గాంలో ఉగ్రదాడి అమానుషం



నసీరున్నీసా బేగం

రేపల్లె రూరల్: పహల్గాంలో ఉగ్రదాడి అమానుషమని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షురాలు నసీరున్నీసా బేగం ఖండించారు. పట్టణంలోని తన చాంబర్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఉగ్రవాదులు విదేశీ పర్యాటకులపై జరిపిన దాడి భారతీయ హృదయాలను కదిలించి వేసిందని తెలిపారు. ఉగ్రవాదాన్ని తుడిచి పెట్టేందుకు దేశ ప్రజలంతా ఐక్యంగా ఉండాలని చెప్పారు. దేశ భద్రత కోసం ప్రాణాలు అర్పించిన వారిని స్మరించుకుంటూ, భవిష్యత్తులో ఇటువంటి దాడులు జరగకుండా ప్రతి పౌరుడు సిద్ధంగా ఉండి దేశభక్తిని ప్రదర్శించాలని ఆమె సూచించారు. కేంద్ర ప్రభుత్వం కూడా దాడులను తిప్పికొట్టేలా రక్షణ చర్యలను ముమ్మరం చేయాలని ఆమె కోరారు. ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమరులకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు.

రావినూతల వాసికి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్‌లో స్థానం



మాధవీశ్రీకి సర్టిఫికేట్ ప్రదానం

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని రావినూతల గ్రామానికి చెందిన మాధవీశ్రీ నాన్ స్టాప్ మ్యూజిక్ ప్లేలో గిన్నిస్ బుక్ ఆఫ్ వర్ల్డ్ రికార్డు సాధించింది. విజయవాడలోని హలెల్ మ్యూజిక్ స్కూల్ ద్వారా ప్రపంచస్థాయిలో 18దేశాల నుంచి 1100 మంది విద్యార్థులు సంగీత ప్రదర్శనలో పాల్గొన్నారు. కీ బోర్డు వాయిద్యంతో ఇచ్చిన ప్రదర్శనలో మాధవీశ్రీతో పాటు మొత్తం 1046 మందిని ఎంపిక చేసి గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదు చేశారు. విజయవాడలోని మెట్రోపాలిటన్ చర్చిలో జరిగిన అభినందన సభలో మ్యూజికల్ స్కూల్ నిర్వాహకుడు అగస్టీన్ దండింగ చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. తండ్రి రామారావుతో పాటు గ్రామానికి చెందిన పలువురు మాధవీశ్రీని అభినందించారు.

గిన్నిస్ వరల్డ్ రికార్డులో అల్లూరు చిన్నారులు

అల్లూరు(కర్లపాలెం): పిట్టలవానిపాలెం మండలంలోని అల్లూరు గ్రామానికి చెందిన చిన్నారులు మ్యూజికల్ కీబోర్డు వాయించి గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించారు. అల్లూరు గ్రామానికి చెందిన కొప్పుల రవికుమార్, సౌభాగ్య దంపతుల కుమార్తె ఆరాధ్య, కుమారుడు ఆద్యా ఆన్‌లైన్ బృంద సంగీత ప్రదర్శనలో మ్యూజికల్ కీబోర్డు వాయిద్యంలో ప్రతిభ కనబరిచి గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించారు. హలేల్ మ్యూజిక్ స్కూల్ అగస్టీన్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకుని 18 దేశాల నుంచి 1,046మంది కీబోర్డు వాయిస్తూ జరిగిన ఆన్‌లైన్ పోటీలో ఆరాధ్య, ఆద్యా పాల్గొన్నారు. వీరిని గిన్నిస్ రికార్డ్సు ప్రతినిధులు ఇటీవల సత్కరించి సర్టిఫికెట్ అందజేశారు.

చీరాల న్యాయవాదికి సముచిత స్థానం



న్యాయవాది ప్రసన్నను సత్కరిస్తున్న న్యాయవాదులు

చీరాల రూరల్: ఆంధ్రప్రదేశ్ బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధిగా చీరాల ఐక్యనగర్‌కు చెందిన న్యాయవాది కె.ప్రసన్న ఎంపికవ్వడం గర్వకారణమని ఏపీ బహుజన్ లాయర్స్ ఫోరం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన అభినందన సభలో మహిళా ప్రతినిధిగా ఎంపికైటన న్యాయవాది ప్రసన్నను ఏపీ బహుజన్ లాయర్స్ ఫోరం సభ్యులు, పార్టీ కార్యకర్తలు సత్కరించారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బార్ అసోసియేషన్‌లో మహిళా ప్రతినిధిగా న్యాయవాది ప్రసన్న ఎంపికవ్వడం మంచి పరిణామమని కొనియాడారు. నిరుపేదలతో పాటు పార్టీ పక్షాన నిలబడి ఉచితంగా న్యాయ సేవలందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా, నియోజకవర్గ బాధ్యులు జగన్మోహనరావు, మార్కు, న్యాయవాదులు సీహెచ్. మస్తాన్‌రావు, ఎ.విశ్వేశ్వరరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మే 2 నుంచి కొలకలూరులో ఆహ్వాన నాటికల పోటీలు

తెనాలి: రూరల్ మండల గ్రామం కొలకలూరుకు చెందిన కొలంకపురి నాటక కళాపరిషత్, శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉభయ రాష్ట్రస్థాయి 11వ ఆహ్వాన నాటికల పోటీలు మే నెల 2-4 తేదీల్లో జరగనున్నాయి. గ్రామంలోని చిన్న రథశాల వద్ద ప్రతిరోజూ రాత్రి ఏడు గంటల్నుంచి 11 గంటల వరకు పోటీలు జరుగుతాయని శ్రీసాయి ఆర్ట్స్ దర్శకుడు, రంగస్థల, సినీనటుడు గోపరాజు విజయ్ ఆదివారం తెలియజేశారు. తొలిరోజున కళాపరిషత్ గౌరవాధ్యక్షుడు వైఎస్‌కేఎస్ స్వామి, ఉపాధ్యక్షుడు సుద్దపల్లి మురళీధర్ జ్యోతిప్రజ్వలన చేస్తారు. తొలి ప్రదర్శనగా ఉషోదయ కళానికేతన్, కట్రపాడు వారి 'కిడ్నాప్' నాటికను ప్రదర్శిస్తారు. రచన, దర్శకత్వం చెరుకూరి సాంబశివరావు. తర్వాత కళానికేతన్-వీరన్నపాలెం వారి 'రుతువు లేని కాలం' నాటిక వుంటుంది. అగస్త్య రచించిన నాటికకు వైబీ చౌదరి దర్శకత్వం వహిస్తారు. చివరగా గురజాడ కళామందిర్-విజయవాడ వారి 'మహాప్రస్థానం' నాటికను ప్రదర్శిస్తారు. 3వ తేదీన విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్-హైదరాబాద్ వారి 'స్వేచ్ఛ', యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్, విజయవాడ వారి '27వ మైలురాయి', మైత్రి కళానిలయం-విజయవాడ వారి 'బ్రహ్మ స్వరూపం'నాటికలను ప్రదర్శిస్తారు. చివరిరోజైన 3వ తేదీన లలిత శ్రీకళా సమితి, శ్రీకాకుళం వారి 'మతమా? మానవత్వమా' నాటిక, మహతి క్రియేషన్స్, హైదరాబాద్ వారి 'ఉక్కు సంకెళ్లు' నాటికలను ప్రదర్శిస్తారు. చివరగా శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు వారి ప్రత్యేక ప్రదర్శన 'జనరల్ బోగీలు' నాటికను ప్రదర్శిస్తారు.

కళాప్రముఖులకు అవార్డుల ప్రదానం

ఆహ్వాన నాటికల పోటీల వేదికపై ప్రముఖులకు అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందని విజయ్ తెలియజేశారు. తొలిరోజున ఆకుల సాంబశివరావు అధ్యక్షతన జరిగే సభలో నటుడు, దర్శకుడు కరణం సురేష్ జ్ఞాపకార్థం 'సవ్యసాచి' అవార్డును తాడేపల్లికి చెందిన ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు గంగోత్రి సాయికి బహూకరిస్తారు. సంగీత దర్శకుడు తుమ్మల సాంబశివరావు స్మారకంగా భైరికి చెందిన సంగీత దర్శకుడు పి.లీలామోహనరావును సత్కరిస్తారు. ఈ సభలో ముఖ్యఅతిథిగా ప్రముఖ సినీ రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా పాల్గొంటారు. 3వ తేదీన జరిగే సభలో గోపరాజు హేమలత జీవిత సాఫల్య పురస్కారాన్ని ఒంగోలుకు చెందిన రంగస్థల నటీమణి ఎం.రత్నకుమారికి ప్రదానం చేస్తారు. పిన్నమనేని మృత్యుంజయరావుకు సభకు అధ్యక్షత వహిస్తారు. 4వ తేదీన గోపరాజు బాలాత్రిపురసుందరి జీవిత సాఫల్య పురస్కారాన్ని రంగస్థల, సినీనటి సురభి ప్రభావతి బహూకరిస్తారు. పసుమర్రుకు చెందిన రూపశిల్పి పచ్చల శేషగిరిని రూపశిల్పి మదన్‌మోహన్ స్మారకంగా సత్కరిస్తారు. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరవుతారని వివరించారు.

ఇగ్నో కోర్సులతో ఉద్యోగావకాశాలు పుష్కలం

గుంటూరు ఎడ్యుకేషన్: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) అందిస్తున్న కోర్సులతో పుష్కలమైన ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయని ఇగ్నో ప్రాంతీయ కేంద్ర డైరెక్టర్ డాక్టర్ పి.శరత్‌చంద్ర పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల ప్రాంగణంలోని ఇగ్నో అధ్యయన కేంద్రంలో ఆదివారం 2025 జనవరిలో భాగంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. శరత్‌చంద్ర మాట్లాడుతూ ఇగ్నో అందిస్తున్న వివిధ రకాల కోర్సుల గురించి వివరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే ఉద్దేశంతో ఇగ్నో అందిస్తున్న మెటీరియల్ అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఇగ్నో సైట్‌లో పొందుపరచి ఉంటుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని చక్కగా చదువుకోవాలని చెప్పారు. ఇగ్నో అధ్యయన కేంద్ర సమన్వయకర్త డాక్టర్ డీవీ చంద్రశేఖర్ మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా చదువుకోవాలనే లక్ష్యం కలిగిన వారు ఇగ్నో ద్వారా వారి ఆశయాన్ని నెరవేర్చుకోవాలని సూచించారు. ఇగ్నో వంటి ప్రతిష్టాత్మకమైన విశ్వవిద్యాలయంలో చదవడం ద్వారా ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి విద్యార్థులకు ప్రాజెక్టు వర్క్సు గురించి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో అధ్యయన కేంద్ర కౌన్సిలర్ డాక్టర్ ఎంఎస్ నారాయణ, సహాయ సమన్వయకర్తలు డాక్టర్ పి.దేవేంద్ర గుప్త, ఎం.మార్కండేయులు, సిబ్బంది పాల్గొన్నారు.